
పత్తి రైతుల నిరాశ

దొనకొండ: ఈ ఏడాది పత్తి రైతులు నిరాశతో ఉన్నారు. గడిచిన ఏడాదిలో మంచి దిగుబడి, నాణ్యమైన ధర పలకడంతో రైతులు సొమ్ము చేసుకున్నారు. ఈ ఏడాది పెట్టుబడి సొమ్ము కూడా చేతికందే పరిస్థితి లేదని గ్రామాల్లోని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని వెంకటాపురం, ఇండ్లచెరువు, పెదన్నపాలెం, పెద్దగుడిపాడు, చిన్న గుడిపాడు, గంగదేవిపల్లి, వద్దిపాడు, సంగాపురం, యర్రబాలెం, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో రైతులు సుమారు 8,500 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పత్తి నాటిన సమయంలో వర్షాలు లేక పైరు కొంత భాగం గిడుగు బారింది. రైతులు రసాయనిక, క్రిమి సంహారిక ఎరువులు వాడుకుని తీరా పత్తి పూతకు వచ్చే సమయంలో తుఫాన్‌లు మొదలై పూత, పిందె రాలిపోవడంతో పత్తి రైతులకు మూలిగే నక్కపై తాటికాయ పడినట్లయింది. ఎకరాకు 3, 4 క్వింటాళ్లు మాత్రమే చేతికొచ్చింది. పెట్టుబడి ఖర్చు ఎకరాకు రూ.30 వేలు దాటిందని గ్రామాల్లోని రైతులు చెప్పన్నారు. దీనికి తోడు మద్దతు ధర కల్పించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటున్నారు. చేతికి అందిన దగ్గర అప్పులు చేసి విత్తనాలు, రసాయనిక, క్రిమిసంహారిక ఎరువులు కొనుగోలు చేశారు. అప్పులు తీర్చుదామంటే ఇళ్లల్లోనే పత్తి నిల్వ చేసుకున్నారు. పత్తి బ్రోకర్లు వస్తున్నారు. పోతున్నారు. రైతు అడిగితే రూ.5 వేలు, 6 వేలకు ఇస్తావా.. అని మాట దాట వేస్తున్నారు. దళారి వ్యవస్థతో రైతులు నట్టేట మునిగిపోయారు. ఈ ఏడాది కుటుంబ పోషణ ఎలా చేయాలో అర్థం కావటం లేదంటూ వాపోతున్నారు.


ఓ ఇంట్లో నిల్వ ఉన్న పత్తి

మద్దతు ధర కేటాయించాలి:



8 ఎకరాలు సాగు చేశా. దిగుబడి ఆశించినంత రాలేదు. గిట్టుబాటు ధర లేదు. ఈ ఏడాది కూలీల ఖర్చు పెరిగింది. గతేడాది మనిషికి రూ.300 ఇచ్చాం. ఈ ఏడాది 500 కూలి అయింది. రూ.9 వేలు గిట్టుబాటు ధర వస్తేనే వచ్చే ఏడాది వ్యవసాయానికి మొగ్గు చూపుతాం.

– వెత్రి కోటిరెడ్డి, గంగదేవిపల్లి

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి:



ప్రభుత్వం పత్తి రైతులకు మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలి. వర్షాలకు దిగుబడి తగ్గింది. ఆశించినంత దిగుబడి రాలేదుద్దేటా ఎకరాకు 10 క్వింటాళ్ల పత్తి వచ్చేది. ఈ ఏడాది వాతావరణం కారణాలతో 5 క్వింటాళ్ల లోపు మాత్రమే వచ్చింది. దానికి తోడు ఖర్చు పెరిగింది. ప్రతి ఏడాది ఎకరాకు ఖర్చులు పోను రూ.40 వేలు మాత్రం మిగిలేవి. ఈ ఏడాది రూ.20 వేలు నష్టం వచ్చేలా ఉంది.

– పొల్లా శ్రీను, గంగదేవిపల్లి

ధర లేక పత్తి ఇళ్లల్లో నిల్వ ఉంచాం:



ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించలేదు. పత్తి మాత్రం ఇళ్లల్లోనే దాచుకున్నాం. మా ఊరికి పత్తి దళారులు వచ్చి పోతున్నారు. ధర మాత్రం రూ.5 వేలు అంటున్నారు. ఆ ధరకు ఇస్తే మేము అప్పుల్లో కూరుకుపోతాం.

– ముచ్చెర్ల అక్కయ్య, గంగదేవిపల్లి

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే తాటిపర్తి పర్యటన

యర్రగొండపాలెం: ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ మంగళవారం యర్రగొండపాలెంలో పర్యటించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఉదయం 10 గంటలకు స్థానిక కొలుకుల సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తారని, అనంతరం పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

పెద్దారవీడు: మండలం పరిధిలోని దేవరాజుగట్టు పంచాయతీ శివాపురంలో పేకాట శిబిరంపై ఎస్‌ఐ పి.అనిల్‌కుమార్ సోమవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ 2,609 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట, బెల్టు షాపులపై పోలీసుల నిఘా ఎల్ల వేళలా ఉంటుందని, మఫ్టీలో పర్యవేక్షణ చేస్తుంటారని తెలిపారు. పేకాటరాయుళ్లను మార్కాపురం కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ ప్రభాకరరావు

పెద్దదోర్నాల: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని యర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావు సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్‌లో ఉన్న ఎన్నో రకాల నేరాలను ఉదాహరణతో విద్యార్థులకు విపులంగా వివరించారు. ముఖ్యంగా పర్సనల్ అకౌంట్లలో ఉన్న డబ్బులు మిస్ కావటంపై ఎలా జాగ్రత్త వహించాలి, సెల్‌ఫోను ఎలా వినియోగించాలి, మన ఫోన్‌కు మెసేజీ వచ్చినప్పుడు ఎలా జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలను ఆయన వివరించారు. అంతే కాకుండా సైబర్ క్రైమ్‌కు గురి అయ్యామనుకున్న పరిస్థితుల్లో 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్సై మహేష్ మాట్లాడుతూ రెగ్యులర్‌గా మీ ఫోన్‌ను రీస్టార్ట్ చేస్తూ ఉండాలన్నారు. అంతే కాకుండా సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి, వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌బాబు, జయసింహ, రమేష్, అతిథి అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి

పుల్లలచెరువు: రబీ పంట బీమా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని మండల సీపీఐ కార్యదర్శి గురునాథం సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. బీమా ప్రీమియం పేరుతో రైతులపై భారం వేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. గత ప్రభుత్వం ఉచిత పంట బీమా అమలు చేసిందన్నారు. అదే తరహాలో ఈ రబీ సీజన్‌లోనూ బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. ఇప్పటికే కనీస ధరలు రాక రైతులు నష్టపోతున్న తరుణంలో బీమా ప్రీమియం అదనపు భారంగా మారిందన్నారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడంలో విఫలమైందని, వెంటనే సకాలంలో రైతులకు న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా మహారుద్ర యజ్ఞం


యజ్ఞం చేస్తున్న కృష్ణస్వామి


ప్రత్యేక పూజలకు హాజరైన బూచేపల్లి కుటుంబ సభ్యులు

తాళ్లూరు: మండలంలోని లక్కవరం శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వనాథ స్వామి ఆశ్రమంలో మహారుద్ర యజ్ఞం ఆశ్రమ వ్యవస్థాపకులు ఆవుల కృష్ణస్వామి సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నందిని, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు హాజరై యజ్ఞం కార్యక్రమంలో పాల్గొన్నారు. పూర్ణాహుతి వేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ముండ్లమూరు (దర్శి): విద్యార్థులు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై వై.నాగరాజు తెలిపారు. మారెళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని చెప్పారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్సై నాగరాజు

చిల్లచెట్లు తొలగించిన అధికారులు


ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న చిల్లచెట్లు తొలగించిన దృశ్యం



సోమవారం సాక్షిలో ప్రచురించిన కథనం

ముండ్లమూరు (దర్శి): అంధకారంలో ఉల్లగల్లు ఎస్సీకాలనీ పేరుతో సోమవారం సాక్షి పత్రికలో ప్రచురించిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. విద్యుత్ స్తంభాలకు అల్లుకుని ఉన్న చిల్లచెట్లు తొలగించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకుని ఉన్న చెట్లను కూడా తీసి వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సాక్షి పత్రికకు అభినందనలు తెలిపారు.

బూచేపల్లి నివాసంలో ఘనంగా అయ్యప్ప పడిపూజ


భారీగా హాజరైన దీక్షా స్వాములు


పడిపూజలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి కుటుంబ సభ్యులు

దర్శి: స్థానిక బూచేపల్లి నివాసంలో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం అత్యంత వైభవంగా సోమవారం జరిగింది. దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నందినీ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు కుటుంబ సమేతంగా హాజరై పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ఏర్పాటు చేసిన అరటి మండపం అందరినీ ఆకర్షించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దేవతా వేషాధారుణలు అందరినీ ఆకర్షించాయి. విద్యుత్ లైటింగ్‌లు మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో వివిధ దీక్షలు తీసుకున్న స్వాములు హాజరయ్యారు. అనంతరం అందరికీ అల్పాహారం వితరణ చేశారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కుమార్తె తన్వికారెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మలు ఆలపించిన అయ్యప్ప భక్తిగీతాలు అందరినీ అలరించాయి.

అయ్యప్ప ఆలయంలో బూచేపల్లి అన్నదానం

దర్శి: స్థానిక హరి హర సుత అయ్యప్ప స్వామి ఆలయంలో దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు సోమవారం కుటుంబ సమేతంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దీక్షా స్వాములకు అన్నదానం ప్రారంభించి అందరికీ స్వయంగా వడ్డించారు.


అన్నదానం చేస్తున్న బూచేపల్లి కుటుంబ సభ్యులు

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



భగవద్గీత ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

దొనకొండ: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక దొనకొండ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చందవరం, దేశిరెడ్డిపల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్తీక మాసంలో దీపాలు వెలిగించటం, అందులోని జ్ఞానం ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సోమవారం ఆత్మ జ్ఞానం తెలుసుకోవటం మంచిదని వారు ప్రబోధించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు టి.ఏడుకొండలు, సభ్యులు ఏ.చెన్నకేశవులు, ఏ.బాలరంగయ్య, టి.ఆదిలక్ష్మీ, ఏ.కాశీలక్ష్మీ, సుబ్బులు, వైష్ణవి, కొండమ్మ, సీతమ్మ పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాల్లో భక్తులు భారీగా చేరుకొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పార్వతీ సమేత చెన్న మల్లేశ్వరాలయం, లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, అయ్యప్ప స్వామి దేవాలయాల్లో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

నాణ్యతతో కూడిన ఎరువులు అందించాలి

తాళ్లూరు: దుకాణదారులు నాణ్యతతో కూడిన ఎరువులు అందించాలని వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు సూచించారు. సోమవారం స్థానిక ఎరువులు దుకాణాల్లో ఎరువులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో అనుమానాలు ఉన్న చోట్ల ఎరువులు శాంపిల్స్ తీసినట్లు తెలిపారు. వాటిని రీజనల్ కోడింగ్ సెంటర్ అమరావతికి, డీఏఓ పల్నాడుకు పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు పాల్గొన్నారు.


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ ప్రసాద్‌రావు